# "గాంధీ - రాజా చంద్ర ఉత్తర ప్రత్యుత్తరాలు - గాంధీ ఆలోచనలపై ప్రభావం"

జూన్ 10, 1891న గాంధీగారి బారిష్టర్ చదువులు అయిపోయి, న్యాయవాదిగా నమోదు అయ్యి హైకోర్టులలో ప్రాక్టీసు చేసే అర్హత సంపాదించి, వేనవేల ఆశలతో ఇండియా బయలుదేరారు. ఇండియా వచ్చాక మొదట బాంబే హైకోర్టులో ప్రాక్టీసు మొదలయ్యింది. ఒకవైపున అనేక కష్టనష్టాలకు గురి అయ్యి, అప్పులపాలైన అన్నయ్య, ఆయన సంసారం, ఇంకోవైపు గాంధీ, ఆయన భార్య. లండన్ చదువుల మధ్య తల్లి మరణం, ఇంటికి వచ్చేదాకా ఆ వార్త ఆయనకు తెలియక పోవడం ! అయితే గాంధీగారు ప్లీడరు వృత్తిలో ఘోరంగా విఫలం అయ్యారు. బాంబే నుండి రాజ్ కోట్‌కి, హైకోర్టు నుండి చిన్న కోర్టులకి దిగి వచ్చినా ఫలితం లేకపోయింది.

బాంబేలో డా॥ మెహతాగారితో వున్నప్పుడు ఆయన గాంధీకి అనేకమంది వ్యక్తుల్ని పరిచయం చేశారు. అందులో గాంధీమీద బలమైన ముద్రవేసిన వ్యక్తి– రాయ్‌చంద్ లేదా రాజచంద్ర. ఆయన తొలుతగా గాంధీకి పరిచయం అయ్యింది ఓ కవిగా. రాజచంద్ర, డా॥మెహతా గారి అన్నయ్య అల్లుడు. ఓ నగలవ్యాపారి. అప్పటి సుమారు పాతికేళ్ళ వయసు. కానీ అప్పటికే జైన సాహిత్యంలో మంచి ప్రవేశమున్న ఆధ్యాత్మిక సాధకుడు. ఆయనకు ఇంకోపేరు "శతావధాని" అంటే ఒకేసారి ఓ వంద విషయాలను గుర్తుంచుకునే లేదా చేసే వ్యక్తి అని గాంధీగారికి తెలిసిన యూరోపియన్ భాషలలోని అన్ని పదాలనీ ప్రయోగించినా, అన్నీ అదే వరుసక్రమంలో గుర్తుంచుకుని తిరిగి గాంధీకి ఒప్పచెప్పేవాడట. సాధారణంగా తెలుగువాళ్ళు ఈ అవధాన ప్రక్రియ పూర్తిగా మాదే అంటారు– కానీ ఈ ఒక సంఘటన బహుశః మనల్ని మరికొంత ఆలోచింపచేస్తుందేమో ?

రాజచంద్రకి అనేక జైన, హిందూ మతగ్రంథాలపై అపారమైన పట్టువుండేది. నైతికంగా మచ్చలేని మనిషి. పాతికేళ్ళ వయసు నాటికే "ఆత్మ సాక్షాత్కారం" అనే దిశగా బలంగా కృషిచేస్తున్న వ్యక్తి. "ముక్తానంద" అనే కావ్యంలోని –

"నేను చేసే ప్రతిపనిలో నిన్ను చూడగల్గినపుడే నేను ధన్యుడని

ముక్తానంద జీవితాన్ని నిలబెట్టే

ఆధారమైన త్రాడు అతనే !

అన్న వాక్యాలు ఆయన హృదయ ఫలకంపైన, పెదవులపైనా నిరంతరం పలుకుతూ వుండేవి.

నగలవ్యాపారం, నిజాయితీ ఇవి రెండూ కొంత విరుద్ధాంశాలు. "అసలు వ్యాపారము, నిజాయితీ ఒకే ఒరలో పొసుగుతాయా?" అన్న అనుమానం అనేక మంది సాధారణమైన మనుషుల్లో సహజంగా వుంటుంది. కానీ రాజచంద్ర దుకాణంలో కూర్చుని నిరంతరం ఏదో ఒక ఆధ్యాత్మిక గ్రంథాన్ని చదువుతూనో లేదా వ్రాసుకుంటూనో, లేదా పాడుకుంటూనో ఉండేవాడట. వ్యాపారం అనే వృత్తి, అతని ప్రవృత్తిని ఇబ్బంది పెట్టలేకపోయింది. అయితే ఎందుకో గాంధీ అతనిని ఎంత అభిమానించినా గౌరవించినా "గురు" స్థానంలో మాత్రం ఉంచుకోలేకపోయారు. కానీ అనేక సందర్భాలలో, ఎప్పుడు కొన్ని ఆధ్యాత్మిక సమస్యలు వచ్చినా రాజచంద్రతో చర్చించేవారు.

మనం గూగుల్‌లోకి వెళ్ళి శ్రీమద్ రాజచంద్ర అని వెతికితే ఆయన యోగసాధనలో ఎంతటి ఉన్నతస్థాయికి వెళ్ళారో ఆయన ఫోటోలతో మనకు అర్థం అవుతుంది. "ఆత్మసిద్ధి," "మోక్షమాల" అనే పద్యకావ్యాలని వ్రాసినట్టూ తెలుస్తుంది. 33 ఏళ్ళ వయస్సుకే (9 నవంబర్ 1867– 11 ఏప్రిల్ 1901) ఆయన వియోగ సాధనలో మోక్షసిద్ధిని పొందినట్లు తెలుస్తుంది.

బాంబే గుజరాత్‌ల ప్లీడరుగా విఫలమైన గాంధీ ఏదో ఓ చిన్న ఉద్యోగమైనా దొరికితే బాగుండునని తీవ్రంగా ఆలోచించేవారు. ఆ సమయంలో అకస్మాత్తుగా సౌతాఫ్రికాలోని దాదా అబ్దుల్లా & కంపెనీలో

చాలా చిన్న క్లర్క్ పోస్టుకి తగిన వ్యక్తి కోసం (గుజరాతీ, ఇంగ్లీషు తెలిసిన వ్యక్తి) వెతుక్కుంటూ ఉంటే, ఆ అవకాశాన్ని గాంధీ దొరకబుచ్చుకున్నారు. సౌత్ ఆఫ్రికాలోనూ అన్నీ చేదు అనుభవాలే. అయితే వాటి గురించి చాలానే సాహిత్యం అందుబాటులో వుంది కనుక ప్రస్తుతం ఈ వ్యాసంలో అవి చర్చించటం లేదు. అయితే ఇన్ని తీవ్రమైన అనుభవాల మధ్య, అనేక సమస్యల మధ్య ఏం చేయాలో దిక్కు తెలియని పరిస్థితిలో – అసలు ఇక్కడ వుండాలా, వద్దా – వుంటే తన జీవితానికి ఆశయం ఏమిటి? ఈ సమస్యలను ఎదుర్కోవాలా? లేదా ఓ సనాతన హిందువుగా తన మోక్షమార్గం కోసం ప్రయత్నం చేయాలా... అన్న ప్రశ్నలు వేధిస్తూ వుంటే, గాంధీ రాజాచంద్రకి 27 ప్రశ్నల ఓ ఉత్తరం వ్రాశారు. ఇది బహుశః మే – జూన్, 1894లో జరిగినట్టు "కలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ మహాత్మా గాంధీ, వాల్యూమ్ – ఒకటి"లో ప్రస్తావించబడింది. ప్రశ్నలు కూడా సంక్షిప్తంగానే వున్నాయి. ఉత్తరం నకలు దొరకలేదు.

కానీ శ్రీమద్ రాజాచంద్ర అనే పుస్తకంలో 292 – పేజీలలో రాజాచంద్ర గాంధీకి ఇచ్చిన జవాబులు ఉన్నాయి. (www.mkgandhi.org) వాటి అనువాదం షుమారుగా ఇలా వుంది. నేను అనువాద ప్రక్రియలో అంతగా అనుభవం ఉన్నవాణ్ణి కాదు. ఇంగ్లీషు పాఠ్యాంతరం ముందు చెప్పిన వెబ్‌సైట్‌లో వుంది (Srimad Rajachandra's Reply to Gandhi's Questions, www.mkgandhi.org)

**1) ప్రశ్న : ఆత్మ అంటే ఏమిటి? అది కర్మ చేస్తుందా? గతపు కర్మలు ఆత్మ పురోగతిని అడ్డుకుంటాయా?**

జవాబు : భౌతిక వస్తువులు ఉదా।। ఒక మట్టి కుండ, లేదా ఓ వస్త్రపు ముక్క ఉన్నట్టుగానే ఆత్మ అనే ఓ సత్యపదార్థమూ వుంటుంది. దాని సారాంశమే– జ్ఞానం. ముందుచెప్పిన భౌతిక పదార్థాలు అశాశ్వతం. అవి అన్ని కాలాలలో ఒకే రూపంలో ఉండలేవు. కానీ "ఆత్మ" అనేది శాశ్వతంగా ఒకే రూపం కలిగివుంటుంది. పాంచభౌతిక మూలపదార్థాలతో తయారుకానిది శాశ్వతమైనది. మూల పదార్థాలను ఎన్ని రకాలుగా మిశ్రమం చేసినా అవి జీవితాన్ని, చైతన్యాన్ని ఉత్పత్తి చేయలేవు. అందువల్ల 'ఆత్మ' అనేది ఉత్పత్తి అయ్యే పదార్థం కాదు. మనందరికి అనుభవరీత్యా తెలుసు. అనేక పదార్థాలను మిశ్రమం చేసి ఓ పదార్థాన్ని చేసినా, ఈ మూల పదార్థాలలో లేని గుణం మిశ్రమపదార్థానికి రాదు. జ్ఞానాన్ని భౌతిక పదార్థాల సారంగ కనుక్కోలేము. పదార్థ స్వరూపాలను మార్చి, మళ్ళీ కొత్త మిశ్రమాలను చేసినా లేదా పదార్థాలు వాటంతకవే మార్పులు చెంది, లేదా యాదృచ్ఛికంగా మిశ్రమాలుగా మారినా అవి భౌతికపదార్థాలే ! వాటికి జ్ఞాన స్వరూపం రాదు. అందువల్ల ప్రధానంగా జ్ఞాన స్వరూపంగా మన పూర్వీకులు, ఋషులు వర్ణించిన 'ఆత్మ'ని, (మట్టి, నీరు, గాలి, ఆకాశం – అనే) పాంచభౌతికాలని ఎన్ని రకాలుగా సంయోగం చేసినా– ఓ కుండ లేదా ఓ వస్త్రాన్ని తయారుచేసినట్టుగా చేయలేము. 'ఆత్మ' యొక్క ప్రాథమిక గుణం–జ్ఞానం. భౌతిక పదార్థాలకు ఆ గుణం వుండదు. భౌతిక పదార్థాల, 'ఆత్మ' ల శాశ్వత గుణ వైవిధ్యమిదే !

ఇదీ, మరి అనేక వేల హేతువుల ద్వారా 'ఆత్మ' శాశ్వతమని, దానికి జీవన్మరణాలు వుండవని రుజువు చేయవచ్చును. అంతేకాదు, విచారం ద్వారా కూడా ఆత్మ శాశ్వతమని తెలుసుకోవచ్చును. 'ఆత్మ' యొక్క ఉనికే మనం అనుభవించే సుఖదుఃఖాలు. అలాగే సుఖ, దుఃఖాల నుండి మనల్ని మనం తొలగించుకోడం కూడా ఆత్మ ద్వారానే. అదే ఆలోచించే, ముందుకు నడిపించే చైతన్యమూ. ఆత్మజ్ఞానం కలిగి వుండటమే దాని ప్రధాన స్వభావం. ఈ స్వభావం ద్వారా కూడా అది శాశ్వతం. 'ఆత్మ' అనే విశ్వాసమే సత్యాన్ని అంగీకరించే గుణాన్ని కలిగివుంటుంది. అందువల్ల ఈ ఆలోచనలలో తప్పుకానీ, తార్కిక సమస్య కానీ లేదు.

2) ఆత్మయొక్క సారాంశాన్ని తెలుసుకున్నపుడు ఆత్మ జ్ఞానపుదశని చేరుకుంటుంది. ఆ దశలో అదే కర్త, అది అత్యంత తేజోవంతమైన స్థితి. (అంటే అది ఆత్మ యొక్క నిజమైన స్థితి). తద్వారా కేవల చైతన్యం కలుగుతుంది – అది దాని నిజస్వరూపం. అవిద్యస్థితిలో అది క్రోధం, రాగం, బంధం, ఆశ లాంటి ఉద్వేగాలకి కర్త. ఆ ఉద్వేగాల ఫలితాలు అనుభవించేటపుడు అది ఈ భౌతిక పదార్థాలైన కుండ, వస్త్రం మొదలైన వాటి కర్తగా మారుతుంది. అంటే వాటి మూల పదార్థాల సృష్టికర్త అది కాదు. కానీ వాటికి

ఆకారాలను నిర్దేశించే కర్త. ఈ స్థితిని జైనంలో కర్మ అని, వేదాంతంలో భ్రమ లేదా మాయలాంటి వివిధ పదాలతో నిర్వచిస్తారు. జాగ్రత్తగా వివేచన చేస్తే ఆత్మ ఈ భౌతిక పదార్థాలకి లేదా ఉద్వేగాలకి కర్త కాదు. కేవలం ఆత్మావిష్కరణకే అది కర్త.

3) అవిద్య లేదా జ్ఞానరాహిత్యపు దశలో చేసే కర్మలు మొదట్లో ఓ విత్తనం వలే వుండి, కాలక్రమేణ వృక్షాలుగా మారుతాయి. ఇంకోరకంగా చెప్పాలంటే ఈ కర్మఫలంగానే ఆత్మ దుఃఖాన్ని అనుభవిస్తుంది. ఎలాగైతే నిప్పును ముట్టుకున్న వ్యక్తికి వేడి అనుభవంలోకి వచ్చి, అది బాధగా అంతిమంగా మారుతుందో, అలాగే క్రోధాది ఉద్వేగాలకు కర్త అయిన ఆత్మ కూడా జనన, జరా, మరణాల రూపంలో దుఃఖాన్ని అనుభవిస్తుంది. అందువల్ల ఈ విషయ వాంఛలనుండి దూరం అవ్వడం అనే స్థితి అర్థం చేసుకోవడం, ఆ ప్రయత్నమే ఫలితాలనిస్తుంది అని తెలుసుకోవడం అవసరం. ఈ భావనపైనే నీవు జాగ్రత్తగా ఆలోచించాలి. ఏదైనా ప్రశ్నలు ఉదయిస్తే అడగవచ్చును.

**2) ప్రశ్న : దేవుడంటే ఏమిటి? ఆయనే ఈ విశ్వాన్ని సృష్టించాడా?**

జవాబు : నీవు, నేను, ఇతరులు కర్మ అనే బంధం ద్వారా ఇబ్బంది పడుతున్న ఆత్మలం. కర్మ నుండి విముక్తి పొందిన, కేవల ఆత్మ– ఆది ఆత్మయొక్క నిజ స్వరూపం. అదే పరమాత్మ– ఈశ్వర స్థాయి. జ్ఞానమనే ఐశ్వర్యం కలిగిందే ఈశ్వర స్వరూపం. ఈ ఈశ్వర తత్త్వమే ఆత్మయొక్క సహజస్థితి. కానీ ఇది కర్మతో ముడిపడి వున్నంతకాలం తెలియదు. ఈ కర్మలతో ముడిపడి వుండటం తన సహజగుణం కాదు అని 'ఆత్మన్' ఎప్పుడు తెలుసుకుంటాడో, ఆత్మవైపు తిరిగి ఎప్పుడు శ్రద్ధని పెడతాడో అప్పుడే తిరిగి స్వర్వజ్ఞత, శక్తి దానిలో వ్యక్తం అవుతాయి. అప్పుడు ఆత్మకు మించిన శక్తి సృష్టిలోని ఏ వస్తువులోను లేదన్న విషయం మనం చూడగలం అందువల్ల నేను "ఈశ్వర" అనేది "ఆత్మ" కు మరోపేరని బలంగా విశ్వసిస్తున్నాను. 'ఈశ్వర' అనేది ఆత్మకంటే ఎక్కువ శక్తివంతమైనది, విభిన్నమైనది కాదు.

2) ఈశ్వరుడు సృష్టికర్త కాదు. అణవులు, అంతరాళం కూడా అనశ్వరమైనవిగానే ఊహించాలి. అది ఇంకో పదార్థం నుండి సృష్టింపబడేవిగా కాదు. ఈశ్వరుడి నుండి ఇవి సృష్టింపబడ్డాయి అన్నా తప్పే అవుతుంది. ఈశ్వరుడు ఆత్మస్వరూపుడైతే అణువులు, అంతరాళం ఎలా వస్తాయి? ఆత్మ నుండి పదార్థం ఉద్భవించడం అసాధ్యం. అలాగని ఈశ్వరుణ్ణి ఓ పదార్థంగా భావిస్తే, ఇక అతని ఈశ్వరతత్వమే పోతుంది. ఆధ్యాత్మిక అస్తిత్వం వున్న ఆత్మ కూడా ఈశ్వరుణ్ణించి రాదు. ఎప్పుడైతే మనం అతన్ని ఆత్మ, పదార్థం అనే రెండింటిగా పరిగణిస్తామో అప్పుడే మనం, ఆత్మ, పదార్థ స్వరూపం ఉన్న ఈ ప్రపంచాన్ని ఈశ్వర స్వరూపంగా భావించగలం. అలాకాక, ఈ అణువుల్నీ, అంతరాళాన్ని అనశ్వర విషయాలుగా భావించి, అదే సమయంలో ఈశ్వరుణ్ణి కేవలం కర్మ ఫలాలనిచ్చే రూపంగా భావిస్తే– అదీ మనం రుజువు చేయలేం. అందువల్ల ఈ భౌతిక ప్రపంచాన్ని భౌతిక ప్రపంచంగా భావిస్తేనే కొంత సబబుగా వుంటుంది. ఈ ఆలోచనకి అవసరమైన, ఒప్పించగల కారణాలు షట్‌దర్శన సముచయం–1 లో ఇవ్వబడ్డాయి.

**3) (ఎ) మోక్షం అంటే ఏమిటి?**

జవాబు : అవిద్య స్థితిలో ఆత్మ – క్రోధాది గుణ సమన్వితమై శరీరంతో బంధింపబడి వుంటుంది. ఆ స్థితినుండి పూర్తిగ విడిపోవటం, దానినుండి విముక్తి– దీన్నే మోక్షమని జ్ఞానులు నిర్వచించారు. కాసింత పరిశీలనవల్ల ఇది సహేతుకం అని, సరైనదని తెలుస్తోంది.

**4) ప్రశ్న : సజీవంగా వున్న వ్యక్తి ఎవరైనా తనకు మోక్షం కలుగుతుంది, లేదా కలగదు అని ఖచ్చితంగా తెలుసుకోవడం వీలవుతుందా?**

జవాబు : మన చేతులు తాళ్ళతో అనేక ముడులుగా బంధించి వున్నపుడు, ఒక్కొక్క ముడి నెమ్మదిగా విడిపోతున్నపుడు, ఇలా ఒక్కో ముడి ఒకదాని తర్వాత ఒకటి విడిపోతున్నాయి అన్న భావన మనకి

తెలుస్తుంది. చివరికి తాడు మొత్తం తీసివేసిన భావన కలుగుతుంది. అలాగే అవిద్య వల్ల అనేక బంధనాలతో వున్న ఆత్మ కూడా ఒక్కో బంధనం విడిపోతుంటే, ఆ విడిపోవడాన్ని భావించగలదు. మోక్షం వైపు పురోగమిస్తున్నట్టుగా చైతన్యాన్ని పొందగలదు. బంధనాలన్నీ తెగిపోతున్నపుడు, ఆత్మ కూడా తన కేవలత్వపు ప్రకాశాన్ని గుర్తించగలదు. చివరగా తను అవిద్య నుండి మోక్షం పొందుతూన్నట్టుగా నిస్సందేహంగా తెలుసుకోగలదు. శరీరంలో వున్నప్పుడే అవిద్య స్థితి నుండి ఆ ఆత్మ బయటికి వస్తుంది, స్వచ్ఛమైన చైతన్యంగా మారుతుంది. తను, ఈ శరీరం వేరు అని తెలుసుకుంటుంది. అన్ని రకాల సంబంధాల నుండి విముక్తిని పొందుతుంది. అంటే జీవంతో వున్నపుడే మోక్షస్థితిని అనుభవించవచ్చును.

**5) ప్రశ్న : మరణం తర్వాత మనిషి, తన కర్మఫల ఆధారంగా జంతువుగానో, చెట్టుగానో, రాయిగానో పుడతాడట. నిజమేనా?**

జవాబు : అవును. ఆత్మ శరీరాన్ని వదిలేశాక, అది తన యోగ్యతనుబట్టి ఓ స్థితికి చేరుకుంటుంది. అందువల్ల అది ఒక తక్కువ జీవిగా లేదా ఓ పదార్థంగానో రూపు తీసుకోవచ్చును. అయితే దీని అర్థం అది రాయిగానో, మట్టిగానో అవుతుందని కాదు.

ఆత్మ రాయి శరీరాన్ని తీసుకున్నా, అది ఒక ఆత్మగానే మన గల్గుతుంది. ఆ అస్తిత్వం మనకు వ్యక్తం కాక పోవచ్చును. మిగతా నాలుగు ఇంద్రియాలు (కళ్ళు, చెవులు, ముక్కు, నాలుక) వ్యక్తం అవకపోవడం వల్ల దాన్ని శరీరంగా వర్ణించవచ్చు. (పంచేంద్రియాలు – కళ్ళు, చెవులు, ముక్కు, నాలుక, శరీరం) ఆత్మ తన కర్మ ఫలాన్ని అనుభవించాక ఆ రాయిని విడిచిపోవచ్చును. అప్పుడు ఆ రాయి కేవలం అణువులుగా భావించ వచ్చును. అంటే రాయి ఆత్మగా మారదు. ఎందుకంటే అది కేవలం పదార్థ స్వరూపం. కర్మ ఫలాన్ని అనుభవించేందుకు ఆత్మ కేవలం ఒకే ఇంద్రియ స్వభావం (అంటే రాయి విషయంలో కేవలం స్పర్శ – శారీరక అనుభవం) కల రాయి స్వరూపం తీసుకోవచ్చును. ఆ స్వరూపంలో మిగతా నాలుగు ఇంద్రియాలు ఆకారం పొందక పోవచ్చును. శరీరం అనేది ఆత్మ ధరించే వస్త్రం లాంటిది. అది ఆత్మ స్వభావం కాదు.

**ప్ర. 6 & 7) (ఇందులో గాంధీ గారి ప్రశ్న ప్రత్యేకంగా మనకు అందుబాటులో లేదు. అయితే జవాబును బట్టి చూస్తే – కర్త శరీరమా – ఈ మట్టి, రాయి ఇలాంటివా లేకా వాటి రూపాన్ని ధరించిన ఆత్మనా? –** అన్నది ప్రశ్నలాగుంది)

ఆ పదార్థాలలో ప్రవేశించి, నివసించే ఆత్మే కర్త. పదార్థం కర్త కాదు. అయినా ఆత్మ, పదార్థం మధ్య సంబంధం – "పాలు– నీళ్ళు" లాంటి సంబంధం. అవి రెండు కలసి వున్నా పాలు పాలే, నీరు నీరే! కర్మబద్ధమైన ఆత్మ పదార్థంతో కలసి కేవలం ఒకే ఇంద్రియం (స్పర్శ) కలిగివున్నా, దాని సారాంశంలో అది ఆత్మ. పదార్థస్థితిలో కూడా దానికి ఆకలి, భయంలాంటి గుణాలు వుంటాయి. అయితే అవి వ్యక్తీకరింపబడవు.

**8) ప్రశ్న : (1) "ఆర్యధర్మం" అంటే ఏమిటి? (2) అన్ని మతాలు వేదాలలో నుండే పుట్టుకొచ్చాయా?**

జవాబు : (1) "ఆర్యధర్మం" ని నిర్వచించేటపుడు ప్రతి వ్యక్తికి తన మత సంబంధమైన దృష్టికోణం వుంటుంది. జైనులు జైనమతంగాను, బౌద్ధులు బౌద్ధమతంగాను, వేదాంతినులు వేదాంతంగాను ఆర్యధర్మాన్ని నిర్వచిస్తారు అయితే గురువులు, ఆచార్యులు, జ్ఞానులు "ఆర్య" అంటే ఓ ఉన్నతమైన మార్గంగా నిర్వచిస్తారు. ఇది మాత్రమే ఆత్మ తననితాను తెలుసుకునేలా చేస్తుంది. ఇది ఒక్కటే సరైనది.

2) వేదాలనుండే అన్ని మతాలు ఆవిర్భవించాయి అనే మాట తప్పు. నాకు అనుభవం ద్వారా తెలుసు. జైన తీర్థంకరుల లాంటి అనేక మహాత్ములు వేదాలలోని జ్ఞానం కంటే వేల నిగూఢమైన జ్ఞానాన్ని వ్యక్తీకరించారు. అసంపూర్ణమైన దాని నుండి పరిపూర్ణమైనది రాదు. అందువల్ల అన్ని మతాలకి వేదాలు మూలం అనడం సబబుకాదు. వైష్ణవమతం, ఇంకొన్ని మతాలు వేదాలనుండి పుట్టివుండవచ్చును. అయితే

వేదాలు బుద్ధ, మహావీరుల కంటే ముందు ఉండి ఉండవచ్చును. అలాగని ఏది పురాతనమో అది పరిపూర్ణమైనది, తరువాత వచ్చింది అసత్యం, అపరిపూర్ణం అని చెప్పలేము. అంతేకాదు– వేదాలలోని భావాలు, జైనసిద్ధాంతాలు ఆది నుండి వున్నవే. వాటి బాహ్యరూపాలు మారినాయి. పూర్తిగా నూతన ఆవిష్కరణం, పూర్తిగా నశించడం అనేది వుండదు. వేదాలు, జైనం ఆది నుండి వున్నవే కనుక వివాదాలకు తావులేదు. అదే సమయంలో నీవు, నేను అందరం వీటన్నిటిలో ఏది ఎక్కువ బలమైనది, సత్యమైనది అని చింతన చేయవలసిందే.

**9) ప్రశ్న : (1) వేదాలని ఎవరు స్వరపరిచారు? అవి అనాదియా?**

**2) అవి అనాది అయితే, "అనాది" అంటే ఏమిటి?**

జవాబు : (1) బహుశః వేదాలు స్వరపరచబడి చాలా కాలం అయివుంటుంది.

(2) పుస్తకంగా పరిగణించబడే ఏ పవిత్ర రచనలు అనాది కావు. వాటిలోని భావనల పరంగా అన్ని పవిత్రగ్రంథాలు అనాదియే ! ఎందుకంటే అవి ఏదో ఒక రూపంలో ఒకొరికొకరు బోధించుకునే ఆ మహాత్ములు ఎప్పుడూ ఉంటారు. క్రోధమనే ఉద్వేగం అనాది. అలాగే అహింస కూడా. మనం పరిగణనలోనికి తీసుకోవలసింది ఆత్మ ఉన్నతికి ఏది దోహదపడుతోంది అని. పై రెండు వ్యతిరేకతలు అనాదియే. ఒక్కోసారి ఒక్కో ఉద్వేగం బలంగా వుండవచ్చును.

**10) ప్రశ్న : "గీత"కి కర్త ఎవరు? భగవంతుడు దీనికర్త? అతనే అనే సాక్ష్యం ఏదైనా వుందా?**

1) ఈ ప్రశ్నకి పైన చెప్పిన జవాబులో కొంత సమాధానం వుంది. ప్రకాశవంతమైన స్థితి చేరిన వాడు భగవంతుడైతే, (పరిపూర్ణమైన ప్రకాశస్థితి), "గీత"ను కూర్చిన వాడు భగవంతుడే. ఒకవేళ భగవంతుడంటే – ఆకాశంలాగా సర్వవ్యాపకుడు, నిరంతరంగా వున్న వాడు, ఏ క్రియచేయని వాడుగా – ఆలోచిస్తే "గీత"నే కాదు, ఏ పుస్తకానికి అతడు కర్త కాలేదు. పుస్తకం వ్రాయడమనేది ఒక సాధారణ క్రియ. కాలంలోన ఒక నిర్దిష్ట సమయాన జరిగే పని. అది అనాది కాదు.

2) గీత వ్యాసుడి సృష్టి. కృష్ణ భగవానుడు అర్జునునికి బోధించడం వల్ల దాని నిజకర్త ఆయన అని అంటారు. అది నిజం కావచ్చును. అయితే అది గొప్ప కావ్యం. దానిలోని భావనలు పురాతనమైనవి. అయితే ఈ శ్లోకాలు గతంలోనూ ఇలాగే వుండేవనీ చెప్పలేము. అలాగని క్రియ చేయని భగవంతుడు వాటిని సృష్టించి వుండడు. క్రియ చేయగలిగిన, శరీర స్వరూపం ఉన్న ఆత్మే అది వ్రాయగలదు. అందువల్ల, పరిపూర్ణ తేజోవంతమైన మనిషే భగవంతుడని, అతడు చెప్పిన శాస్త్రం భగవంతుడే వ్యక్తపరిచాడని భావించడంలో తప్పేమీ లేదు.

**11. (ప్ర) : జంతువుల్ని ఇతరాలని బలివ్వడం ద్వారా ఏదైనా ఔన్నత్యం కలుగుతుందా?**

జ) ఏదైనా జీవిని బలి ఇవ్వడం, దానిని ఏ రకంగానైనా బాధ పెట్టడం పాపం. దీనిని యాగం చేసినా, దైవసన్నిధిలో చేసినా పాపమే. ఈ యజ్ఞాలలో కానుకలు ఇవ్వడంలో కొంత మంచేవున్నా, అది హింసతో కూడుకున్నవి కనుక, అవి మెచ్చుకోతగ్గ పనులు కావు.

**12 ప్ర.ఎవరైనా ఒక మతం అన్నిటికంటే మంచిది అన్నపుడు, అలా అన్న వారిని ఋజువు చూపించమని అడగవచ్చునా?**

జ) ఋజువు అవసరం లేకపోయినా, ఏ ఆధారమూ లేకుండా అలాంటి ప్రతిపాదన చేసినా, సహేతుకమైనా, నిర్హేతుకమైనా, ధర్మమైనా – అన్నింటిని, మహోన్నతంగానే భావించాలి. ఋజువు అనేది ఏది అత్యంత గొప్పదో, ఏది కాదో చూపించగలదేమో. ఏ మతమైతే ఈ ప్రాపంచిక బంధనాల నుండి మనకు విముక్తినిస్తుందో, మనల్ని మన కేవల మాత్రంగ నిలబెడుతుందో అదే గొప్ప మతం. నిజంగా బలమైన మతం.

**13. ప్ర మీకు క్రైస్తవ మతం గురించి తెలుసా? దానిపై మీ అభిప్రాయం ఏమిటి?**

జ. కొద్దిగా తెలుసును. ఆ కొద్ది పాటి పరిశీలనతో కూడా – ఇండియా అంత లోతుగా ఏ దేశం కూడా ఈ మతపరమైన మార్గంలో ప్రయాణం చేయలేదని, ఇండియన్ ఆధ్యాత్మిక వాదులు కనుగొన్నంతగా ఆ మార్గాన్ని ఇతరులు కనుగొన లేదని తెలుస్తోంది. మోక్ష స్థితిలో కూడా నిరంతరం లొంగుబాటును క్రైస్తవం నమ్ముతుంది. ఇది ఆత్మ యొక్క అనాదిత్వానికి, కర్మ సూత్రాలకి, కర్మరాహిత్యానికి తగిన నిర్వచనం కాదు. అందువల్ల క్రైస్తవం అతి గొప్ప మతం అనేది నేను ఒప్పుకోలేను. నేను ఉదహరించిన సమస్యలకు అది సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేదు. నేను ఈ మాటని ఓ పక్షపాత ధోరణితో ఇవ్వడం లేదు. నీ కింకేవైనా ప్రశ్నలు వుంటే నేను నీ అనుమానాలని నివృత్తి చేయగలను.

**14. ప్ర : క్రిస్టియనులు బైబిల్‌ని దైవిక ప్రేరణకలదిగా భావిస్తారు. దేవుడి కొడుకుగా క్రీస్తుని ఆయన అవతారంగా భావిస్తారు. ఆయన దైవపు అవతారమా?**

జ. ఇది విశ్వాసానికి సంబంధించింది. హేతువుతో దీనిని ఋజువు చేయలేము. నేను భగవద్గీత, వేదాల గురించి ముందు ఏం చెప్పానో అది బైబిల్‌కీ వర్తిస్తుంది. ఆద్యంతాలు లేని దేవుడు అవతారాలు ఎత్తడం అసాధ్యం. పుట్టుక అనేది అనుబంధాలు, రాగద్వేషాలకి సంబంధించింది. అవి లేని దేవుడు మానవ స్వరూపం తీసుకోవడం సహేతుకం కాదు. కేవలం జీసస్ దేవుని బిడ్డ అనేది ఓ ఉపమానంగా ఒప్పుకోవచ్చును. కానీ హేతువు పరంగా దాన్ని ఒప్పుకోవడం కష్టం. నిర్గుణుడైన దేవుడికి కొడుకు ఎలా వుంటాడు? ఒకవేళ దేవుడు, దేవుడి కొడుకూ – ఇద్దరూ అనాది అయితే తండ్రి, కొడుకుల సంబంధాన్ని ఎలా వివరించగలరు? ఇవి, ఇంకా ఇతర అభ్యంతరాలు మరింత లోతుగా పరిశీలించవలసిన అవసరం వుంది. అలా పరిశీలిస్తే, ఈ నమ్మకాన్ని ఒప్పుకోలేము.

**15. ప్ర : పాత నిబంధనలలో భవిష్యత్తు గురించి చేసిన ఆలోచనలు క్రీస్తు ద్వారా ఫలీకృతమయినాయా?**

జ. ఒక వేళ అలా నిజమైనా, అవి ఆ రెండు మత గ్రంథాల గురించి మనల్ని ఆలోచించేలా చేస్తాయే కానీ, కేవలం ఓ గ్రంథంలో వున్న భవిష్యత్ ఆలోచనలు ఫలీకృతం అవడం అనే విషయంపై ఆధారపడి జీసస్ దైవ పుత్రుడు అని నమ్మడానికి హేతువు ఒప్పుకోదు. ఎందుకంటే ఓ గొప్ప వ్యక్తి జననం జ్యోతిష్య శాస్త్రం ద్వారా కూడా ఊహించవచ్చును. ఒకవేళ తన జ్ఞానం ద్వారా ఒక వ్యక్తి భవిష్యత్తులో జరగబోయే విషయాన్ని చెప్పినా, ఆ వ్యక్తికి మోక్ష మార్గానికి చెందిన సంపూర్ణ జ్ఞానం ఉంటే తప్ప, ఆ మాటల్ని కేవలం విశ్వాసంగానే తీసుకోవాలి. అయితే దీనికి వ్యతిరేకంగా వచ్చే హేతువు ఆ నమ్మకాన్ని బలహీన పరచవచ్చును.

**16. ప్ర** : మరణించిన శరీరంలోకి ఆత్మను తిరిగి ప్రవేశపెట్టాడని లేదా ఆ శరీరంలోకి వేరే ఆత్మని ప్రవేశపెట్టాడని చెబితే, అది బహుశః జరిగి వుండకపోవచ్చును. అదే జరిగితే కర్మ సిద్ధాంతం తన అర్థాన్ని కోల్పోతుంది. యోగశాస్త్రం పై పట్టు వున్న వ్యక్తి కొన్ని అద్భుతాలని చేయగలడు. ఒకవేళ జీసస్‌కి అలాంటి శక్తులు వున్నాయంటే, వాటిని మనం అసత్యమని కాని, అసాధ్యమని కానీ ధృవీకరించలేము. అలాంటి యోగ శక్తులు ఆత్మశక్తి కంటే గొప్పవి కావు. యోగ శక్తుల కంటే ఆత్మ అనంతంగా గొప్పది. మనం కలసి నప్పుడు దీని మీద నీవు మరిన్ని ప్రశ్నలు అడగవచ్చును.

**ప్ర. 17) ఎవరైనా గత జన్మలు గుర్తుంచుకోవడం, భవిష్యత్తు జన్మల గురించి అవగాహన కలిగి వుండటం సాధ్యమా?**

జ) ఇది సాధ్యమే. ఎవరి జ్ఞానమైతే స్వచ్ఛమైనదో వారు అలా చేయగలరు. మేఘాల సందేశాన్ని బట్టి వర్షపు అవకాశాన్ని ఎలా ఊహించగలమో, అలాగే ఈ జన్మలోకి కర్మలను బట్టి గత జన్మలో వాటి కారకాలను కొంత మేరకు ఊహించగలము. అలాగే భవిష్యత్తులో వీటి పరిణామాలను కొంత మేరకు నిర్ణయించవచ్చును. మరింత ఆలోచిస్తే ఆత్మ యొక్క గతానుభవాలు, భవిష్యత్తు రూపం ఊహించవచ్చును.

**18. ప్ర : ఒక వేళ సాధ్యమైతే, ఎవరు చేయగలరు?**

జ. ఈ ప్రశ్నకు జవాబు పై జవాబులోనే వుంది.

**19. ప్ర : మీరు మోక్షాన్ని పొందిన కొంతమంది పేర్లు ఇచ్చారు. వాటికి సాధికారత ఏది?**

జ. ఈ ప్రశ్నని నీవు నాకు సంబంధించి అడిగి వుంటే, నేను చెప్పగలిగేది ఏమిటంటే – భౌతిక విషయాలతో పెనవేసుకున్న వ్యక్తి తన అనుభవాల ఆధారంగా అతను ఏమి మాట్లాడుతాడు, ఏమి చేస్తాడు అనేది కొంతమేరకు అంచనా వేయవచ్చును. వాటి ఆధారంగా అతను మోక్షం పొంద గలడా లేదా నిర్ధారించుకోనూ వచ్చును. చాలా విషయాలలో, శాస్త్రాల ద్వారా మన అంతిమ నిర్ణయాలకి బలం దొరుకుతుంది.

**20. ప్ర : బుద్ధుడు కూడా మోక్షాన్ని పొందలేదని మీరు చెప్పగలరా?**

జ) బుద్ధిస్ట్ రచనలలోని బోధనల మీద ఆధారపడే. ఆ బౌద్ధ రచనలలోని అభిప్రాయాలు బుద్ధునివే అయితే వాటిలో అనేక వైరుధ్యాలు కనబడతాయి. అదే పరిపూర్ణ తేజో లక్షణం కాదు. ఒక వ్యక్తి పరిపూర్ణ జ్ఞానోదయాన్ని పొందకపోతే అతని బంధాలు, రాగద్వేషాలు అతన్ని వదిలి వెళ్ళవు. భౌతికత దాని ప్రధాన పరిణామము. అలాంటి వ్యక్తి సంపూర్ణ మోక్షాన్ని పొందినట్టుగా చెప్పుకోలేదు. అంతేకాదు, బుద్ధుని బోధనల పేరుతో ఉన్న రచనల కంటే బుద్ధుడి ఆలోచలు వేరు అనే విషయం కూడా ఇతర స్వతంత్ర్య రచనల ద్వారా తెలుసుకునే అవకాశం, నీకూ–నాకు లేదు. అతని రచనలు భిన్నమైనవి అని, అవి ఋజువు చేస్తే, మనం అంగీకరించక పోవడానికి కారణం లేదు.

**21. ప్ర : ఈ సృష్టి చివరగా ఏమవుతుంది?**

జ) అన్ని ఆత్మలు సంపూర్ణ మోక్షం పొందుతాయని కాని, లేదా సృష్టి పూర్తిగా లయం అవుతుందని కాని నాకు అనిపించటంలేదు. ఇది నిరంతరంగా ప్రస్తుత స్థితిలో కొనసాగే అవకాశం వుంది. దానిలోకి కొంత భాగం మార్పుకు లోను కావచ్చును. అదృశ్యం కావచ్చును. ఇంకో భాగంలో పెరగవచ్చును. ఇంకొకచోట తగ్గిపోనూ వచ్చును. ఈ అంశం దృష్టిలో వుంచుకుని, లోతుగా ఆలోచిస్తే ఈ ప్రపంచపు పూర్తి నాశనం అయ్యే అవకాశం వుంది. ప్రపంచం అంటే కేవలం ఈ భూమి మాత్రమే కాదు.

**22. ప్ర : భవిష్యత్తులో ఈ ప్రపంచం నైతికంగా ఇంకా బాగా వుంటుందా?**

జ) ఈ ప్రశ్నకు జవాబు ద్వారా మోక్షాన్ని ప్రేమించే ఏ వ్యక్తిని ప్రోత్సహించడం మంచిది కాదు. నైతికత, అనైతికత – లాంటి అన్ని ధోరణులు పురాతనంగా వున్నవే. అయితే నీకు, నాకు – అనైతికతను వదలి నైతికతను తీసుకోవడం సాధ్యము. అది ఆత్మ కర్తవ్యం కూడా. అయితే అందరూ అనైతికతను వదలి నైతికతను తీసుకుంటారని గట్టిగా చెప్పడం సాధ్యం కాదు. అలాంటి విపరీత స్థితి వచ్చే అవకాశం లేదు.

**23. ప్ర : సృష్టి పూర్తిగా లయ పొందడం లాంటిది వుంటుందా?**

జ) 'ప్రళయం' అంటే పూర్తిగా వినాశనం అనుకుంటే అది జరగదు. ఎందుకంటే ఉన్నదంతా మొత్తంగా నశించడం అనే సాధ్యం కాదు. అయితే 'ప్రళయం' అంటే ఉన్నదంతా ఆ భగవంతుడిలో లయం పొందడం అని భావిస్తే ఈ నమ్మకం కొన్ని సిద్ధాంతాలు ఒప్పుకున్నాయి. అయితే నా వరకు అది కూడా సాధ్యం కాదేమో అనిపిస్తుంది. ఎందుకంటే అన్ని పదార్థాలూ, అన్ని ఆత్మలు ఒకే స్థితికి ఎలా వస్తాయి? వ్యక్తీకరించిన ఒకటే తత్త్వంగా పరమాత్మని, అవ్యక్తీకరించిన వైవిధ్యంగా ఆత్మలని భావిస్తే, ఈ వైవిధ్యం శరీర సంబంధం లేకుండా ఎలా మనగలదు? ఒకవేళ ప్రళయ స్థితిలో అలాంటి సంబంధం ఉంటుంది అని భావిస్తే, అప్పుడు అని ఆత్మలు ఒకే ఇంద్రియంగా భావించాల్సి వస్తుంది. అలా చేయటంలో, నిష్కారణంగా, ఇతర జీవన స్థితులని విస్మరించాల్సి వస్తుంది. అటువంటప్పుడు ఉన్నత స్థితులు చేరుకుని, జీవించే స్థితిని దాటి మోక్షానికి దగ్గరగా వున్న ఆత్మ కూడా అదే స్థితిలో ఉండి పోతుంది. ఇలాంటి, మరెన్నో అనుమానాలు ఉత్పన్నమవుతాయి. అందువల్ల అన్ని ఆత్మల ప్రమేయం కలిగిన ప్రళయం అసాధ్యం.

**24. ప్ర : నిరక్షరాస్యుడు కేవలం భక్తి ద్వారా మోక్షాన్ని పొందగలడా?**

జ. భక్తి జ్ఞానానికి, మోక్ష జ్ఞానానికి హేతువు. నిరక్షరాస్యుడు అనేమాటకి అక్షర జ్ఞానం లేని వాడు అనే అర్థం అయితే అతను భక్తిని పెంపొందించుకోవడం అసాధ్యం కాదు. ఆత్మ యొక్క సారాంశమే జ్ఞానం. అందువల్ల  భక్తి ఆ జ్ఞానాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శుద్ధి చేయబడ్డ జ్ఞానం మోక్షానికి కారణం అవుతుంది. పరిపూర్ణ జ్ఞానం వ్యక్తీకరణ అయ్యేదాకా, పరిపూర్ణ మోక్షం కూడా సాధ్యం కాదు. సంపూర్ణ ఆధ్యాత్మిక జ్ఞానం అనే భావనలో అక్షర జ్ఞానం అనేది లేదు. అక్షర జ్ఞానం మోక్షానికి కారణం కాదు. అక్షర జ్ఞానం లేకపోతే ఆత్మసాక్షాత్కారం సాధ్యం కాదు అనేది తప్పు.

**25. ప్ర : రామ, కృష్ణలు భగవదావతారాలు అంటారు. అంటే ఏమిటి? వారే భగవంతుడా లేక భగవతాంశ? వారి మీద విశ్వాసంతో మోక్షం పొందవచ్చునా?**

జ) నేను కూడా వారిరువురు పరమాత్మ యొక్క ఆత్మస్వరూపాలే అని భావిస్తాను. ఇద్దరూ ఆత్మ స్వరూపాలుగా భగవంతులే. వారి ఆత్మలని ఆవరించిన అన్ని ఆవర్తనలు తొలగిపోయాయి, కనుక వారు పరిపూర్ణ మోక్షాన్ని చేరిన వారే. అయితే ఏ ఆత్మ కూడా భగవంతుడిలో భాగం కాదు అని నేను అనుకుంటాను. దానికి అనేక కారణాలు వున్నాయి. ఆత్మ భగవంతుడిలో భాగం అనుకుంటే బంధం, బంధ విముక్తి (మోక్ష) అనే నమ్మకాలకి అర్థం లేదు. అలా అయితే భగవంతుడే అవిద్యకి కారణం అవుతాడు. అప్పుడు ఆయన భగవంతుడే కాదు. ఆత్మకి అధిపతిగా భావించడంలో భగవంతుడు తన స్థాయిని కొంత తగ్గించుకుంటాడు. భగవంతుడిలో ఆత్మ దేనికీ కర్త కాదు. ఇవి తదితర కారణాల వల్ల ఆత్మ భగవంతునిలో భాగం అని నేను నమ్మలేకపోతున్నాను. అలాంటప్పుడు రామ, కృష్ణ లాంటి పరమాత్మ విషయంలో ఎలా నమ్మగలను? వీరిద్దరూ వ్యక్తీకరింపబడ్డ భగవత్ స్వరూపాలుగా భావించడంలో తప్పులేదు. అలాగని పరిపూర్ణ భగవత్ తత్త్వం వారితో వ్యక్తీకరింపబడిందనేది అనుమానమే.

(2) వారిపై విశ్వాసంతో మోక్షాన్ని పొందగలమా అనేది సులభంగానే చెప్పవచ్చును. మోక్షం అంటే అన్ని బంధనాల నుండి విముక్తి. లేదా ఏ బంధనాలు లేకపోవడం. ఈ బంధనాల నుండి, అజ్ఞానాన్నుండి ఎవరి బోధనలు మనకు స్వేచ్ఛనిస్తాయో ఆ వ్యక్తిపై విశ్వాసం పెంచుకోడం ద్వారా మోక్షం పొందవచ్చును. గురువుపై ఎంత విశ్వాసం ఉందో, ఎంతగా మనం గురువుతో ఏకత్వాన్ని పొందుతామో అంతే విశ్వాసం మన నిజ వ్యక్తిత్వంపై కూడా కేంద్రీకరిస్తూ, మన ఆత్మపై అంతే విశ్వాసం కలిగి వుంటే మోక్షం పొందవచ్చును. ఇది కాని భక్తితో పరిపూర్ణ మోక్షాన్ని పొందలేము. ఆ భక్తిలో మోక్ష మార్గాన్ని పొందడం సాధ్యమేమో కాని, అది కూడా ఖచ్చితత్వంతో చెప్పలేము.

**26. ప్ర : బ్రహ్మ, విష్ణు, శివ – అంటే ఎవరు?**

జ) సృష్టి, స్థితి, లయల త్రిగుణాత్మకతను నమ్మి, వాటికి రూపం (బ్రహ్మ, విష్ణు, శివ) ఇచ్చేవారికి ఇలాంటి విశదీకరణలు ఆమోదయోగ్యం. ఇవి పురాణాలు నిర్వచించిన విధానం కాదు. కొన్ని నిర్వచనాలు కేవలం మతపరమైన ఉపమానాలే. ఆ సూత్రాలను నిర్ధారించే బదులుగా మనం వాటిని వాడుకొని లాభపడటం మంచిదని నా అభిప్రాయం.

**27. ప్ర : పామునన్ను కాటు వేయబోతే నేను దానిని కాటు వేయనివ్వాలా లేక (నన్ను నేను రక్షించుకునే మార్గాంతరం లేకపోతే) దాన్ని చంపేయాలా?**

3) పాము నిన్ను కాటువేయనీ అనే సలహా ఇవ్వడానికి ఎవరైనా సందేహిస్తారు. అదే సమయంలో ఈ శరీరం నశ్వరమని తెలిసి ఇటువంటి శరీరాన్ని కాపాడుకోవడం కోసం ఒక జీవిని చంపడం నీకు ఎంత వరకు సబబు? ఆధ్యాత్మిక సంక్షేమాన్ని కోరుకునే వారికి, అలాంటి సమయంలో ఈ శరీరం నశించేలా అవకాశం ఇవ్వడమే సబబు. అయితే ఆధ్యాత్మిక సంక్షేమాన్ని కోరుకోని వ్యక్తి ఏం చేయాలి? అతనికి కూడా – ఆ పామును చంపమని, తద్వారా నరకానికి పొమ్మని ఎలా సలహా ఇవ్వగలను? ఆర్యధర్మం లేని

వ్యక్తికి ఆ పామును చంపమని సలహా ఇవ్వవచ్చును. కానీ నీవూ, నేనూ కలలో కూడా అలాంటి వ్యక్తిగా వుండాలని కోరుకోలేము.

("గాంధీ ప్రశ్నలు–రాజాచంద్ర జవాబులు, శ్రీమత్ రాజా చంద్ర ఆశ్రమం, ఆగస్ట్, గుజరాత్)

గాంధీ–రాజాచంద్రల మధ్య జరిగిన ఈ ఉత్తర ప్రత్యుత్తరాలను గమనిస్తే ఇదొక ఉపనిషద్ సంవాదం లాగా ఉంటుంది. ఇందులో దాదాపు అయిదు ప్రశ్నలు –"మోక్షం" గురించి. సనాతన హిందూ సాంప్రదాయంలో పురుషార్థాలు నాలుగు – ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. ఇందులో మోక్షం చివరిది. అలాగే నాలుగు ఆశ్రమధర్మాలు – బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాలు. బ్రహ్మచర్యావస్థలో జీవించడానికి సంబంధించిన జ్ఞానం – గృహస్థ ఆశ్రమంలో సంసారం, పిల్లలూ – వానప్రస్థలో వీటికి కొంచెం దూరంగా జరిగి, సంపూర్ణమైన స్థితప్రజ్ఞత్వానికి ప్రయత్నం – చివరగా సన్యాసం – అంటే అన్ని బంధనాలు వదులుకున్న మోక్ష ప్రయత్నం. అయితే జైనంలో, బౌద్ధమతంలో ఈ అన్ని స్థాయిలూ అవసరం లేదు. రాజాచంద్ర జైన మతావలంబి. అందుకే మోక్షం మీద ప్రాధాన్యత.

గాంధీ మోక్ష ప్రాధాన్యతనని ఒప్పుకున్నాడు. కానీ దానికోసం ఈ ప్రాపంచిక విషయాల నుండి తొలగిపోవడం అనేది ఒప్పుకోలేకపోయాడు. అయితే అదే సమయంలో రాజాచంద్ర కొన్ని చదవవలసిన పుస్తకాల పట్టీ గాంధీకి పంపిస్తాడు. అందులో ఒకటి "యోగవాసిష్ఠం". పదహారు, పదిహేను సంవత్సరాల వయసులో, రాముడికి వచ్చిన సందేహాలకి వశిష్ఠుడు ఇచ్చిన జవాబులు. దీనికి, ఇప్పుడు గాంధీ–రాజాచంద్రల మధ్య జరిగిన సంభాషణలకి కొంత పోలిక వుంది. 'యోగవాసిష్ఠం'లో రాముడు నాకు జ్ఞాన సముపార్జన అయిపోయింది, అన్ని ఆత్మలకు మోక్షమే కదా మార్గం, ఇక నేను మోక్షం కోసం ప్రయత్నిస్తాను – మధ్యలో ఈ సంసారం రాజ్యం... ఎందుకు అని చింతిస్తాడు. వాసిష్ఠ బోధనతో తిరిగి జీవన స్రవంతిలోకి వచ్చేస్తాడు. అయితే ఇక్కడ రాజాచంద్ర ఒక జైన మతావలంబిగా గాంధీని ప్రాపంచిక విషయాలు వదలి మోక్షం కోసం ప్రయత్నం మొదలుపెట్టమంటాడు. ఇక్కడ గాంధీ యోగవాసిష్ఠపు పాఠాన్ని గమనిస్తాడు. ప్రాపంచిక సమస్యలను పట్టించుకోడం తన ప్రధాన కర్తవ్యంగా తీసుకుంటాడు. అంటే గురువు ఇచ్చిన సందేశానికి పూర్తిగా వ్యతిరేక నిర్ణయాలకి వస్తాడు.

ఈ సమయం నుండే – ధర్మ, అర్థ, కామ, మోక్షాలకి (పురుషార్థాలు) కొత్త నిర్వచనాలు వెదుక్కుంటాడు. 'ధర్మం' అనే పురుషార్థంలో ఒక విద్యుక్త ధర్మం (duty) అని, అలాగే మతపరమైన, నీతిపరమైన అంశంగాను తీసుకుంటాడు. అలాగే 'కామం' అనే దానికి కేవలం శృంగారమని కాక – శృంగారానికి, పునరుత్పత్తికి, ఆనందానికి వున్న సంబంధాన్ని పరీక్షిస్తాడు. అలాగే 'అర్థం' అంటే కేవలం ధనం కాదని ఉద్యోగం, శ్రమలతోపాటు ఆధునిక సమాజంలో "పాలిటిక్స్" కూడా ఒక వ్యక్తి అర్థమే అని పునర్ నిర్వచిస్తాడు. ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ బాధ్యతల రూపంలో 'అర్థ' అనే పదాన్ని అన్వయిస్తాడు. ఈ చర్చలో సారాంశం ఏమిటి? మరి నాలుగవ పురుషార్థం 'మోక్షం'ని ఎలా అర్థం చేసుకోవాలి అన్న ప్రయత్నంలో – ఈ మొదటి మూడు పురుషార్థాల సమన్వయ ఫలితంగా భావిస్తాడు. పందొమ్మిదవ శతాబ్దపు రెండవ భాగం, ఇరవైయ్యవ శతాబ్దపు తొలి భాగంలో అనేకమంది జ్ఞానులు, చింతనాపరులు ప్రాపంచిక విషయాలని వదలి ఆశ్రమ జీవితాలవైపు, మోక్ష మార్గం వైపు పరిగిడుతుంటే, ప్రజ మధ్య వుంటూ, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, వాటి పరిష్కార మార్గాలలో మోక్షానికి పునాది వుందని అర్థం చేసుకుంటాడు. సనాతన ధర్మపు అన్ని సంక్లిష్ట కోణాలను పరిగణనలోనికి తీసుకుంటూనే ఆఫ్రికాలో భారతీయుల సమస్యలు, తిరిగి ఇండియాలో స్వాతంత్ర్య పోరాటంలో ప్రధాన భూమిక ... ఇలా మోక్షానికి నూతన అర్థం తయారు చేసుకున్నాడు. తిలక్ 1922లో గాంధీకి ఉత్తరం వ్రాస్తూ – "రాజకీయాలు సన్యాసుల వ్యవహారాలు కావు" అంటే, గాంధీ "అలా అనడం ద్వారా మీరు సన్యాసుల్ని మరింత బద్ధకస్తులుగా కావడానికి అవకాశం కల్పిస్తున్నారు" అని జవాబిస్తాడు.

మోక్షమనేది ముక్కు మూసుకుని ఆశ్రమాల్లో తపస్సు చేయడంలోనో, మౌనం వహించడంలోనో, కర్తవ్యం నుండి పారిపోవడంలోనో లేదనే ఆలోచనకు గాంధీ 1894లో అంటే 25 సంవత్సరాల వయస్సులో రావడానికి పై గాంధీ–రాజాచంద్రల సంభాషణలదే ప్రధాన భూమిక. ఆ తరువాత ఆయన ఆచరణ చరిత్రలో ఒక భాగం. అయితే ఆంథోని జె. పేరల్ అనే భారతీయుడు, కెనడాలో కాల్గరీ యూనివర్సిటీ చరిత్ర అధ్యాపకుడు ఈ అంశంపై విస్తృత పరిశోధన చేసి – Gandhi's Philosophy and the Quest for Harmony – అనే పుస్తకం వ్రాశారు. అందులో సనాతన హిందూ ధర్మంలోని పురుషార్థాలకి గాంధీ ఆధునిక వివరణ ఎలా ఇచ్చారు అనేది చాలా విస్తృతంగా చర్చించారు.

గాంధీ సైద్ధాంతిక, కార్యాచరణల నిర్దేశంలో గాంధీ – రాజచంద్రల సంభాషణలు, ఉత్తర ప్రత్యుత్తరాలకు ఉన్న ప్రాధాన్యత అర్థం చేసుకోడం చాలా అవసరం. అయితే దాదాపు జీవితపు చివరి దశల దాకా గాంధీ నిరంతరం తన మనస్సులో గురుస్థానం ఖాళీగా ఉందని దిగులు పడే వారు. కానీ ఆయన హిందూ ధర్మ శాస్త్రాలని – వసిష్ఠ గీత, భగవత్ గీతలని, ఇంకా అనేక విషయాల్ని పరిశీలించి, అంతకు ముందు అనేకమంది జ్ఞానులు ఇచ్చిన వివరణలని, భాష్యాలని ఒప్పుకోని తీరును గమనిస్తే, ఆయన మదిలో గురుస్థానం భర్తీ చేయడం ఎవరికీ అంత సులభం కాదనీ తెలుస్తుంది. అలాగనీ ఆయన కూడా ఎవరికీ గురువుగా కావడానికి ఒప్పుకోలేదు. ఇరవయ్యవ శతాబ్దపు వ్యతిరేకాల చలన (dialectical movement) కి గాంధీ గురు–శిష్య సమస్య అద్దం పడుతుంది.

**డా॥ అవధానం రఘుకుమార్**
9441015709